సాక్షి
కరీంనగర్

సోమవారం ၊ 6 ၊ మే ၊ 2024

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భానుడు భగ్గుమన్నాడు.
ఆదివారం 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

'సన్'డే — ఉమ్మడి జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

కరీంనగర్ (వీణవంక)	సిరిసిల్ల	పెద్దపల్లి	జగిత్యాల (వెల్గటూర్)
46.7	44.4	46.4	47.1



న్యూస్‌రీల్

మంత్రి పొన్నంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు



ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు

కరీంనగర్‌టౌన్: బీజేపీ కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌పై ఇంటర్వ్యూలు, ప్రచార సభల్లో నిరాధార, అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నేత కొట్టె మురళీకృష్ణ ఆదివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యక్తిగత దూషణలు, అవమానకర పదజాలంతో మంత్రి ప్రసంగాలు చేస్తున్నారని ఆరోపించారు. భారతీయుల ఆరాధ్య దైవం శ్రీరాముని పేరు వాడుతూ హిందువుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మంత్రి ఎన్నికలు ముగిసే వరకు ప్రసంగాలు, ఇంటర్వ్యూలు ఇవ్వకుండా నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

కమిషనరేట్ వ్యాప్తంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు గాను అక్రమంగా డబ్బు, మద్యం, ఇతర వస్తువుల తరలింపునకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు ఆదివారం కమిషనరేట్ వ్యాప్తంగా కరీంనగర్ వన్‌టౌన్, టూటౌన్, త్రీ టౌన్ పరిధిల్లోని బస్టాండ్ ఏరియా, కమాన్ చౌరస్తా , మంచిర్యాల చౌరస్తా, తెలంగాణ చౌక్‌తో పాటుగా జిల్లావ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల వారీగా పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టారు. డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు సైతం నిర్వహించారు. ఎన్నికల నియమావళి ముగిసే వరకు వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని సీపీ పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు నియమావళి పాటించాలని, ఉల్లంఘించి పట్టుబడిన వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని తెలిపారు.

రామ్ కథా ప్రవచనం ప్రారంభం



రామ్‌కథా ప్రవచనం ప్రారంభిస్తున్న పవన్

కరీంనగర్‌కల్చరల్: జిల్లా కేంద్రం శివారులోని కొండ సత్యలక్ష్మి గార్డెన్‌లో ఆదివారం మార్వాడీల ఆధ్వర్యంలో వరంగల్‌కు చెందిన పవన్ మహారాజ్ రామ్ కథా ప్రవచనాన్ని ప్రారంభించారు. అంతకుముందు వేదభవనం నుంచి మార్వాడీ సమాజం బాధ్యులు ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. కాగా ప్రవచనం ఈ నెల 11వ తేదీ వరకు రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7.30 గంటల వరకు జరగనుందని, 12వ తేదీన ముగింపు కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నేడు సీపీఐ జాతీయ కార్యదర్శి రాక

కరీంనగర్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సీపీఐ నాయకులు, ప్రజాసంఘాల ముఖ్య నాయకుల సమావేశం పద్మనాయక కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించనున్నట్లు ఆపార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ, లౌకిక శక్తుల ఏకీకరణ, రాజ్యాంగ పరిరక్షణకు ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వాములై ఉన్నందున కరీంనగర్ కాంగ్రెస్ అ భ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపును ఆ కాంక్షిస్తూ సమావేశంలో పార్టీ శ్రేణులకు నారా యణ దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్..

- జగిత్యాలలో కేసీఆర్ రోడ్‌షో విజయవంతం
- తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలు
- స్వాగతం పలికిన నాయకులు



జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన బస్సుయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్

జగిత్యాల: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఆదివారం రాత్రి నిర్వహించిన కేసీఆర్ బస్సుయాత్ర బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. సాయంత్రం ఆరు గంటలకు కేసీఆర్ రోడ్‌షో నిర్వహించాల్సి ఉన్నా.. జగిత్యాలకు చేరుకునే సరికి రాత్రి 7.50 గంటలైంది. బస్సుయాత్రలో కేసీఆర్‌తోపాటు నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ వచ్చారు. కొత్తబస్టాండ్ వద్ద జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ రమణ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు ఘనస్వాగతం పలికారు. కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ.. ఒగ్గు కళాకారుల నృత్యాలతో టపాసుల మధ్య యాత్ర కొనసాగింది. కొత్తబస్టాండ్ నుంచి మొదలై అంగడిబజార్, తహసీల్‌చౌరస్తా మీదుగా బస్సుయాత్ర నిర్వహించి అక్కడ ప్రసంగించారు. పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావడంతో యాత్ర బీఆర్‌ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. కేసీఆర్ 20 నిమిషాల పాటు ప్రసంగించారు.

ఆరుగ్యారెంటీల అమలెక్కడ?

కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఒక్కటీ అమలు చేయలేదని కేసీఆర్ అన్నారు. మహిళలకు రూ.2500 వచ్చాయా..? అని మహిళలను ప్రశ్నించారు. నిర్మల్ సభలో రాహుల్ గాంధీ రూ.2500 ఇస్తున్నామని జూటామాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం ఏ ఊరికెళ్తే ఆ ఊరు దేవుడి మీద ఒట్టు పెట్టుకుంట ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు.

వడ్లకుప్పలు ఎక్కడికక్కడే..

దేశంలో ఎక్కడాలేని విధంగా రైతుబంధు అమలు చేశామని, రైతులు సమృద్ధిగా పంటలు పండించుకున్నారని కేసీఆర్ పేర్కొన్నారు. జగిత్యాలలో వడ్లకుప్పలు ఎక్కడికక్కడే ఉన్నాయన్నారు. ఆరెకరాలు, ఏడెకరాలున్న రైతులు ఏం పాపం చేశారని, వారికి రైతుబంధు ఎందుకు వేయలేదన్నారు. రూ.500 బోనస్ బోగస్ అయిందన్నారు. కల్యాణలక్ష్మి, తులం బంగారం కూడా లేదన్నారు. జగిత్యాలలో రెండురెండు తులాలు వచ్చిందంట కదా..? అనడంతో ప్రజలు బిగ్గరగా నవ్వారు.

అందని తాగునీరు

మిషన్ భగీరథ ద్వారా నీరు అందించామని, ఇప్పుడు ఎందుకు రావడం లేదని కేసీఆర్ ప్రశ్నించారు. కరెంట్ కోతలు పెడుతున్నది ఈ అసమర్థత ప్రభుత్వమన్నారు. పేదల ఇళ్లలో నల్లాలు పెట్టి గోదావరి నీరు ఇస్తే ఇప్పుడేం రోగం వచ్చిందని ప్రశ్నించారు. కొత్త స్కీంలు అమలు కావడం లేదని, పాతస్కీంలు బందయ్యాయని ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీగా అర్వింద్ గెలిచి పసుపుబోర్డు తెచ్చారా..? షుగర్ ఫ్యాక్టరీ తెరిచారా..? అని ప్రశ్నించారు. యువత ఆలోచన చేసి ఓటేయాలని, తెలంగాణ భవిష్యత్ వారి చేతుల్లోనే ఉందని తెలిపారు. బీఆర్‌ఎస్ ఎంపీలు గెలిస్తేనే పార్లమెంట్‌లో కొట్లాడతారన్నారు. బీజేపీ ఎంపీలు గెలిస్తే మోదీ ముందు మాట్లాడలేరన్నారు. జిల్లా రచయితలకు నిలయమని, ఇక్కడ చరిత్రకారుడు రమణయ్య వంటి మేధావులు ఉన్నారని, వారు ఆలోచన చేయాలని పేర్కొన్నారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లిలోని బీడీ కార్మికులను ఆదుకున్నది బీఆర్‌ఎస్ అన్నారు. బీఆర్‌ఎస్ గెలుపులోనే తెలంగాణ విజయం ఉందన్నారు. కేసీఆర్ గుండె చీల్చితే తెలంగాణ ఉంటదని, బతికున్నంత వరకూ తెలంగాణ కోసమే పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

జగిత్యాల జిల్లాను రద్దు చేస్తరట..

జగిత్యాల జిల్లా ఇక్కడి ప్రజల ఏళ్ల కల. నెరవేర్చుకున్నాం. మెడికల్ కళాశాల ఊహించనది.. ఏర్పాటు చేసుకున్నాం. వాటిని ప్రభుత్వం తీసేస్తదట. ప్రజలు ఆలోచన చేయాలి.. అని కేసీఆర్ అన్నారు. జగిత్యాల జిల్లాగా ఉండాలంటే జగిత్యాల, నిజామాబాద్, పెద్దపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఎంపీగా గెలిపించాలన్నారు. ప్రస్తుతమున్న ప్రభుత్వానికి తోక తెల్వదు.. తొండెం తెల్వదన్నారు. ఉద్యమ సమయంలో ఈ ప్రాంతమంతా తిరిగి వరదకాలువను రిజర్వాయర్‌గా మార్చామని, వరద కాలువకు తూములు పెట్టడం ద్వారా మత్స్యకారులు, రైతులు బతికారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ వరదకాలువను ఎండబెట్టారని, పంటలు, పొలాలు ఎండిపోయాయని పేర్కొన్నారు. ఐదు నెలల్లోనే తెలంగాణను ఆగంచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బీడీ, గీత, మత్స్యకారులపై పట్టింపే లేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఓవర్సీస్ స్కాలర్‌షిప్ రావడం లేదన్నారు.



బస్సుయాత్రలో ప్రసంగిస్తున్న కేసీఆర్

పర్యటన సైడ్‌లైట్స్..

- కరీంనగర్ నుంచి జగిత్యాలకు రాత్రి 7.51గంటలకు బస్సులో అభ్యర్థులతో కలిసి చేరుకున్నారు.
- కొత్తబస్టాండ్ వద్ద జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, సంజయ్, ఎమ్మెల్సీ రమణ స్వాగతం పలికారు.
- అక్కడి నుంచి బస్సుయాత్రకు జనం నీరాజనం పలికారు .
- బస్సులోంచే కేసీఆర్, పార్టీ అభ్యర్థులు ప్రజలకు అభివాదం చేశారు.
- దారి పొడవునా గులాబీ జెండాలతో కార్యకర్తలు జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు.
- పాతబస్టాండ్ వద్ద కేసీఆర్ ప్రసంగించారు.
- 8.20 ప్రసంగం ప్రారంభించగా 8.40కి ముగించారు.
- ఎమ్మెల్సీ ఎల్.రమణ ఇంటికి వెళ్లారు. రాత్రి జగిత్యాలలోనే బస చేయనున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం బిగించండి

- జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

కరీంనగర్: భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, విద్వేష, విభజన రాజకీయాలు చేస్తున్న బీజేపీని ఓడించి, ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం బిగించాల్సిన అవసరం ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డు ఐఏఎస్ అధికారి, సోషల్ డెమోక్రటిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. పౌర సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి రెవెన్యూ గార్డెన్‌లో నిర్వహించిన సభలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు, ప్రజా వ్యతిరేక విధానాలతో దేశం అధోగతిపాలయ్యే ప్రమాదం ఉందన్నారు. బీజేపీని ఓడించడం ద్వారానే ప్రజాస్వామ్యం బతికి బట్టకడుతుందని పేర్కొన్నారు. దేశ సంపద అదానీ, అంబానీల చేతుల్లో ఉందని, రూ.15 లక్షల కోట్ల రాయితీలను ప్రకటించి పెట్టుబడిదారులకు రెడ్ కార్పెట్ పరుస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాల్సిన అవసరం ఉందన్నారు. రిటైర్డు ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ, దేశంలో 75 కోట్ల బీసీలకు మేలు జరిగే కులగణన చేయకుండా బీజేపీ అడ్డుపడుతుందని, మరో వైపు 2శాతం పేదలున్న ఆధిపత్య కులాలకు 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇచ్చి 50 శాతం పేదలున్న బీసీల రిజర్వేషన్లను 27 శాతానికి పరిమితం చేసిందని మండిపడ్డారు. పదేళ్లలో ఒక్క ప్రభుత్వ విశ్వ విద్యాలయం, పాఠశాల కూడా నెలకొల్పలేదని ఆరోపించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే రాజ్యాంగం కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, విద్వేష రాజకీయాలు చేసే ఆ పార్టీని ప్రజలు చిత్తుగా ఓడించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొరివి వేణుగోపాల్, ఎస్.దేవేందర్, కె. అంజయ్య, వసీం అహ్మద్, గుడికందుల సత్యం, మార్వాడి సుదర్శన్, వర్ణ వెంకట్‌రెడ్డి, ఎండీ మతిన్, ఎం.శ్రీనివాస్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ దొంగలు కేసీఆర్, కేటీఆర్



ఆర్‌ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ సంజయ్‌కుమార్

- బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: 'ఫోన్ ట్యాపింగ్ కేసులో అసలైన దొంగలు కేసీఆర్, కేటీఆర్‌లే. కేటీఆర్ నియోజకవర్గం సిరిసిల్ల కేంద్రంగా తమ ఫోన్లన్నీ ట్యాప్ చేసినట్లు ఈ కేసులో నిందితుడైన ప్రణీత్‌రావు చెప్పారు. అలాగే కేసీఆర్ చెబితేనే ఫోన్లను ట్యాప్ చేశామని రాధాకిషన్‌రావు పోలీసుల విచారణలో వెల్లడించారు. ఇంత స్పష్టమైన ఆధారాలున్నా కేసీఆర్, కేటీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేదు' అని ఎంపీ బండి సంజయ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం కరీంనగర్ కాపువాడలో మున్నూరుకాపు సంఘం నాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా కాపువాడకు విచ్చేసిన బండి వారిని కలిసి బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. కాపు సంఘం నేతలతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. సంఘం నిర్మించే ఫంక్షన్ హాల్‌కు సాయం చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఈసందర్భంగా బండి మాట్లాడుతూ, తనను ఓడించేందుకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటై కుట్ర చేస్తున్నాయన్నారు. 'నేను పక్కా లోకల్.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులిద్దరూ నాన్ లోకల్.. ముగ్గురు అభ్యర్థులను బేరీజు వేసి తీర్పు ఇవ్వాలి.' అని కోరారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బండికి ఆర్‌ఎంపీల మద్దతు

కరీంనగర్‌లోని రాజశ్రీ గార్డెన్‌లో ఆదివారం జరిగిన గ్రామీణ ప్రాంత వైద్యుల ఆత్మీయ సమావేశంలో ఆర్‌ఎంపీ, పీఎంపీలు బండి సంజయ్‌కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ, తనకు మద్దతిచ్చిన గ్రామీణ వైద్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఉందంటే ఆర్‌ఎంపీ, పీఎంపీలే కారణమన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత ఆరు గ్యారంటీలు

- మంత్రి పొన్నం ప్రభాకర్

హుజూరాబాద్: పార్లమెంట్ ఎన్నికల తర్వాత 6 గ్యారంటీలు తప్పకుండా అమలు చేస్తామని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. ఆదివారం రాత్రి హుజూరాబాద్ పట్టణంలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ మాట ఇస్తే తప్పేది ఉండదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారని, అందుకు కృతజ్ఞతగా రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలన్నారు. కరీంనగర్ ఎంపీగా పని చేసిన బండి సంజయ్ ఈ నియోజకవర్గానికి చేసింది గుండు సున్నా అని, రాముని ఫొటో పెట్టుకుని ప్రచారం చేస్తూ ఓట్లు అడుగుతున్నాడని ఎద్దేవా చేశారు. సంజయ్‌కు దమ్ముంటే తాను చేసిన అభివృద్ధి గురించి మాట్లాడాలి తప్ప దేవుని పేరుతో ఓట్లు అడగడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్‌బాబు మాట్లాడుతూ, మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీని ఎన్నికల్లో బొంద పెట్టాలన్నారు. ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు మాట్లాడుతూ, బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఎత్తి వేస్తామని, రాజ్యాంగాన్ని మారుస్తామని అంటున్నారని, దేశ రక్షణకు కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు సొల్లు బాబు, తుమ్మేటి సమ్మిరెడ్డి, దేశిని కోటి, సందమల్ల బాబు, కాజీపేట శ్రీనివాస్, పుష్పలత, ఆలేటి సుశీల, మిడిదొడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అభివృద్ధి నా బాధ్యత

కరీంనగర్ కార్పొరేషన్: తన తండ్రి స్వర్గీయ వెలిచాల జగపతిరావు ఆశయాలకు అనుగుణంగా కరీంనగర్‌ను అభివృద్ధి చేసే బాధ్యత తనదని కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తెలిపారు. ఆదివారం నగరంలోని 7వ డివిజన్ హౌసింగ్‌బోర్డు కాలనీ లైబ్రరీలో స్థానికులతో సమావేశం అయ్యారు. 7వ డివిజన్ కార్పొరేటర్ ఆకుల పద్మ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తన తండ్రి కరీంనగర్ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. అదే తరహాలో తాను అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. పనిచేయాలనే తపనతో పాటు కనీస పరిజ్ఞానం, విజ్ఞానం ఉండాలని, చదువు సంధ్యాలేని బండి సంజయ్ లాంటివారికి ఓటేస్తే అభివృద్ధి శూన్యమవుతుందన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని హనుమాన్, శివాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ పలకరింపులు



తెలంగాణ చౌక్‌లో మాజీ సీఎం కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

కేసీఆర్ సైడ్ లైట్స్

వీణవంక(హుజూరాబాద్): శనివారం అర్ధరాత్రి 12 గంటలకు వీణవంకకు చేరుకున్నారు.

- 12.05 గంటలకు మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు.
- రాత్రి 2గంటల వరకు కార్యకర్తలతో మాటామంతి.
- ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ ముఖ్య నాయకులతో మాటామంతి. మధ్యాహ్నం 3.45 గంటలకు ఆత్మీయ సమ్మేళనం స్టేజీపైకి చేరిక. 3.54 నుంచి 20 నిమిషాల పాటు ప్రసంగం.
- 4.16 గంటలకు బస్సులోకి వెళ్లగా, 4.30 గంటల వరకు కౌశిక్‌రెడ్డి ఇంటి నుంచి కమాన్ వరకు భారీ ర్యాలీ.

'గులాబీ' దళపతికి ఘన స్వాగతం

కరీంనగర్: గులాబీ దళపతి, మాజీ సీఎం కేసీఆర్‌కు ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో ఘన స్వాగతం పలికారు. హుజూరాబాద్ నియోజకవర్గం వీణవంకలో జరిగిన పార్టీ కార్యకర్తల సమ్మేళనంలో పాల్గొన్న అనంతరం జగిత్యాలలో జరిగే రోడ్‌షో కార్యక్రమానికి హాజరయ్యేందుకు కేసీఆర్ కరీంనగర్ మీదుగా వెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్, మేయర్ వై.సునీల్‌రావు ఆధ్వర్యంలో పలువురు కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ శ్రేణులు, మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. కోతిరాంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే గంగుల, కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో కేసీఆర్ కాన్వాయ్‌పై పూలు చల్లుతూ స్వాగతించారు. కాన్వాయ్ తెలంగాణ చౌక్‌కు చేరుకోగానే సునీల్‌రావు ఆధ్వర్యంలో కార్యకర్తలు «సీఎం కేసీఆర్» అంటూ పూలు చల్లుతూ నినాదాలు హోరెత్తించారు. కోర్టు, రేకుర్తి చౌరస్తాల వద్ద బీఆర్‌ఎస్ నాయకులు బృందాలుగా ఏర్పడి కేసీఆర్ కాన్వాయ్‌కి స్వాగతం పలికారు.

- టైగర్ కౌశిక్‌కు మంచి భవిష్యత్ ఉంది.. కేసీఆర్
- జై తెలంగాణ అననోడు సీఎం రేవంత్‌రెడ్డి: ఎమ్మెల్సీ దేశపతి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/హుజూరాబాద్/వీణవంక: వీణవంక మండలంలోని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటి ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం ఉల్లాసంగా సాగింది. కార్యక్రమానికి చుట్టుపక్కల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. వారితో కేసీఆర్ ఉత్సాహంగా మాట్లాడారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన గడ్డ హుజూరాబాద్ అని, 2001లో ఉద్యమ సమయంలో ఇక్కడి ప్రజలు చురుగ్గా పాల్గొన్నారని గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో దళితుల స్థితిగతులను మార్చేందుకు హుజూరాబాద్ వేదికగా దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టామని, ఈ పథకం పొందిన 99 శాతం మంది దళితులు ధనికులయ్యారని వివరించారు. నియోజకవర్గంలో 10.5 శాతం ఓట్లు బీఆర్‌ఎస్‌కు అధికంగా ఉన్నాయని, కష్టపడి 15 శాతానికి పెంచాలని పిలుపునిచ్చారు. హుజూరాబాద్ టైగర్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి మంచి భవిష్యత్ ఉందని, ముందు రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులు కూడా దక్కవచ్చని పేర్కొన్నారు. అతని కోరిక మేరకే ఇక్కడ బస చేశానని, తనకు స్వాగతం పలికిన తీరు మరచిపోనని వెల్లడించారు. వినోద్‌కుమార్ గెలిచాక వీణవంకలోనే ఒకరోజు మొత్తం గడుపుతానని అన్నారు.

జై తెలంగాణ అననోడు సీఎం రేవంత్‌రెడ్డి

కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో జై తెలంగాణ అని పిలవనోడు మనకు సీఎం అయ్యిండని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల విజయతో కలిసి మాట్లాడారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే సీఎం రేవంత్‌రెడ్డి పట్టనట్లు వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. దేశపతి పాడిన పాటలతో సభ ప్రాంగణం మారుమోగింది.

వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం: ఎమ్మెల్యే పాడి

మాజీ సీఎం కేసీఆర్ వీణవంకకు రావడం అదృష్టంగా భావిస్తున్నానని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతుండగా సభ ప్రాంగణం హుజూరాబాద్ టైగర్ కౌశిక్ అంటూ కార్యకర్తల ఈలలతో మారుమోగింది. కేసీఆర్ పాటకు రెండు నిమిషాల పాటు కౌశిక్‌రెడ్డి డ్యాన్స్ చేయగా కార్యకర్తలు స్టెప్పులు వేశారు. రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాల కోరు అని, ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యాడని ఆరోపించారు. ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్ స్ఫూర్తితో సమస్యలపై ఉద్యమిస్తాం

కరీంనగర్: కారల్‌మార్క్స్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవారెడ్డి అన్నారు. మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ జయంతి సందర్భంగా ఆదివారం నగరంలోని కోతిరాంపూర్‌లో గల ముకుందలాల్ మిశ్రాభవన్‌లో మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కారల్ మార్క్స్ ప్రపంచానికే దిక్సూచిగా పనిచేశారని, కార్మికుల శ్రమశక్తి ద్వారానే వస్తువుకు అదనపు విలువ ఏర్పడుతుందని, లాభాలు కార్మికుల శ్రమ ద్వారానే వస్తాయని తెలియజేశారని ఆలయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గీట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జి.బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

క్లుప్తంగా

మొదటి రోజు ప్రశాంతంగా 'నీట్'



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థినులు

తిమ్మాపూర్(మానకొండూర్): ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ వైద్య విద్యలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) అర్హత పరీక్ష మొదటి రోజు ఆదివారం ప్రశాంతంగా ముగిసిందని కరీంనగర్ సిటీ కో–ఆర్డినేటర్, వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్(సీబీఎస్ఈ) అకాడమిక్ డైరెక్టర్ లలితాకుమారి తెలిపారు. జిల్లాలోని 5 పరీక్ష కేంద్రాల్లో 3,540 మంది విద్యార్థులకు గానూ 3,466 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. కరీంనగర్‌లోని వివేకానంద రెసిడెన్షియల్ పాఠశాలలో 828 మందికి 811, వివేకానంద డిగ్రీ కళాశాలలో 792 మందికి 778, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 480 మందికి 469, తిమ్మాపూర్ శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో 720 మందికి 702, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంలో 720 మందికి 706 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు.

తండ్రిని కోల్పోయిన బాధలోనూ 'నీట్'కు..

- పరీక్ష రాసిన ఎంఈవో భూమయ్య కూతురు



అక్షయ

చొప్పదండి: వెల్గటూర్ ఎంఈవో, చొప్పదండి పట్టణానికి చెందిన బత్తుల భూమయ్య వడదెబ్బ కారణంగా శనివారం మృతిచెందిన విషయం విధితమే. ఆయన కూతురు అక్షయ తండ్రిని కోల్పోయిన బాధలోనూ ఆదివారం నీట్‌కు హాజరైంది. అయితే, ఆదివారం సెలవు రోజు కావడంతో కూతుర్ని దగ్గరుండి, పరీక్షకు తీసుకెళ్తానని భూమయ్య షెడ్యూల్ ప్లాన్ చేసుకున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. కానీ, ఆయన ఆకస్మికంగా చనిపోయారన్నారు. డాక్టర్ కావాలన్న నాన్న కోరికను నెరవేర్చేందుకు పుట్టెడు దుఃఖంలోనూ అక్షయ నీట్ రాసిందని పేర్కొన్నారు.

వృద్ధురాలిని ఢీకొన్న కారు



కాలు విరిగిన లచ్చవ్వ

చందుర్తి(వేములవాడ): ఓ పార్టీ సభకు హాజరైన వృద్ధురాలిని కారు ఢీకొట్టడంతో ఆమె కాలు విరిగింది. వివరాల్లోకి వెళ్తే.. చందుర్తి మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన బుర్ర లచ్చవ్వ ఆదివారం మల్యాల శివారులో నిర్వహించిన బీఆర్ఎస్ సభకు వెళ్లింది. అక్కడ ఆటో దిగుతుండగా ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె కాలు విరిగిపోయింది. బాధితురాలిని వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి కుటుంబసభ్యులు లచ్చవ్వను కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు.

నేతన్నల ఎన్ని'కల' చెదిరింది

- ఎన్నికల కోడ్‌తో జెండాలు, కండువాల ఆర్డర్లకు బ్రేక్
- నిబంధనల కఠినతరంతో ఇబ్బంది
- ఉపాధికి దూరమైన సిరిసిల్ల నేత కార్మికులు



సిరిసిల్ల కార్ఖానాలో పార్టీల కండువాలు (ఫైల్)



సిరిసిల్లలో సిద్ధమవుతున్న జెండాలు, కండువాలు (ఫైల్)

సిరిసిల్ల: 'మూలిగే నక్కపై తాటిపండు పడినట్లుగా' తయారైంది సిరిసిల్ల నేతన్నల పరిస్థితి. దేశ వ్యాప్తంగా ఏ ఎన్నికల జరిగినా.. ఆయా రాష్ట్రాల్లోని పార్టీలకు కండువాలు, జెండాలను తయారు చేసి సరఫరా చేస్తూ.. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నేతన్నలు ఉపాధి పొందేవారు. కానీ ఎన్నికల కోడ్ అమలును కట్టుదిట్టం చేయడంతో జెండాలు, కండువాల ఆర్డర్లకు బ్రేక్ పడింది. అసలే బతుకమ్మ చీరల ఆర్డర్లు లేక బతుకుదెరువు కరువై దిక్కులు చూస్తున్న నేతన్నలకు ఎన్నికల కోడ్ మరింత భారంగా మారింది. ప్రతీ ఎన్నికల్లోనూ ఎన్నికల కోడ్ ఉంటుంది... కానీ ఈసారి గతానికి భిన్నంగా అమలు చేయడంతో జెండాలు, కండువాలు, బ్యానర్లు, టోపీల తయారీకి అడ్డంకిగా మారింది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఎన్నికల వేళ అండగా ఉండే రాజకీయ పార్టీల జెండాలు తాజా ఎన్నికల్లో కోడ్ ఎఫెక్ట్‌తో బతుకుదెరువు తారుమారైంది.

ఎన్ని'కల' చెదిరిందిలా..

గతంలో ఎక్కడ ఏ ఎన్నికలు జరిగినా ప్రచారాస్త్రాలు మాత్రం సిరిసిల్లవే అన్నట్లుగా ఉండేది. పార్టీలేవైనా.. అభ్యర్థి ఎవరైనా ఎన్నికల ప్రచారానికి వినియోగించే సామగ్రి సిరిసిల్ల నుంచే సరఫరా అయ్యేది. వస్త్ర పరిశ్రమకు నిలయమైన సిరిసిల్లలో 27 వేల మరమగ్గాలు ఉన్నాయి. ఇందులో 24 వేల మగ్గాలపై పాలిస్టర్ వస్త్రోత్పత్తి సాగుతుండగా.. మరో 3 వేల మగ్గాలపై కాటన్‌వస్త్రం ఉత్పత్తి అవుతుంది. పాలిస్టర్ బట్టపై ఆర్డర్ వచ్చినట్లుగా వివిధ పార్టీల గుర్తులు, రంగులు, అభ్యర్థుల పేర్లు ప్రింటింగ్ చేసి సరఫరా చేసేవారు. పాలిస్టర్ బట్టను పార్టీ రంగుల్లో ప్రాసెసింగ్ చేయించి సరఫరా చేశారు. దేశవ్యాప్తంగా సిరిసిల్ల జెండాలు ఎన్నికల వేళ రెపరెపలాడుతాయి. ఎన్నికల ప్రచారంలో వినియోగించే జెండాలు, తోరణాలు, కండువాలు అందించడం సిరిసిల్ల ప్రత్యేకత. కానీ ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో జెండాలు, కండువాల, తోరణాలు, టోపీల ఆర్డర్లు సిరిసిల్ల నేతన్నలకు దూరమయ్యాయి. నాలుగు దశాబ్దాలుగా సిరిసిల్ల నేతన్నలకు అర్డర్లు లభించేవి. దీని ద్వారా సిరిసిల్లలో 250 మంది కార్మికులు ఉపాధి పొందేవారు. జెండాలను కుట్టు మెషిన్లపై కుట్టే పనిలో మరో వెయ్యి మంది మహిళలు, మగవారు ఉపాధి పొందుతున్నారు. కండువా ధర నాణ్యతను బట్టి రూ.3 నుంచి రూ.60 వరకు ఉంటుంది. జెండాలకు రూ.4 నుంచి రూ.180, టోపీలు(క్యాప్)లకు రూ.5 నుంచి 40 వరకు తోరణాల జెండాలు 10 వేల జెండాలకు రూ.8వేల నుంచి రూ.15వేల వరకు ధరలు ఉండేవి. అంతా నగదు భేరం కావడంతో సిరిసిల్లలో ఆసక్తిగా పని చేసేవారు. కానీ ఈసారి ఆర్డర్లు లేక నేతన్నలకు ఉపాధి దూరమైంది.

కారణాలు ఇవీ..

సిరిసిల్లలో పాతిక వేల కుటుంబాలు వస్త్రోత్పత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. వివిధ పార్టీల జెండాలు, కండువాల ఆర్డర్లు వచ్చేవి. ఆర్డర్ల ఆధారంగా సిరిసిల్లలో సిద్ధం చేసి ట్రాన్స్‌పోర్టు ద్వారా దేశవ్యాప్తంగా సరఫరా చేసేవారు. కానీ ఈసారి ట్రాన్స్‌పోర్టుల పైన ఎన్నికల అధికారులు ఆంక్షలు విధించడంతో ఇక్కడ తయారైన జెండాలను, కండువాలను రవాణా చేసే వ్యవస్థ దూరమైంది. ఏ ట్రాన్స్‌పోర్టు ఆర్డర్ తీసుకున్న ఎన్నికల అధికారులకు సమాచారం అందించాలనే నిబంధనలు విధించడం ప్రతిబంధకంగా మారింది. మరోవైపు ఫ్లెక్సీ ప్రింటింగ్ పెరిగిపోవడంతో జెండాలు, కండువాల ప్రింటింగ్‌పై ప్రభావం పడింది. జెండా స్థానంలో ఫ్లెక్సీలు కడుతున్నారు. మరోవైపు పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో బట్టపై ఏ రంగులనైనా.. ఏ సైజులోనైనా ప్రింటింగ్ చేసేందుకు చిన్న సైజు మిషన్స్ అందుబాటులోకి రావడంతో ఆయా ప్రాంతాల్లోనే జెండాలు, కండువాలను ప్రింటింగ్ చేస్తున్నారు. సిరిసిల్ల నుంచి ముడిసరుకు అంటే తెల్లబట్టను కొనుగోలు చేసి పొరుగు రాష్ట్రాల్లోని ఆయా ప్రాంతాల్లోనే ప్రింటింగ్ చేసి స్థానికంగానే సరఫరా చేస్తున్నారు. మరోవైపు మధ్యప్రదేశ్‌లోని మధురలో సిరిసిల్ల కంటే చౌకగా జెండాలు, కండువాలు లభించడంతో అక్కడికే ఎక్కువగా ఆర్డర్లు ఇచ్చారు. హైదరాబాద్‌లోనూ ప్రింటింగ్ యూనిట్లు ఉండడంతో సిరిసిల్ల నేతన్నల ఉపాధికి గండి పడింది.

పది శాతం ఆర్డర్లు కూడా రాలేదు



దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ఎన్నికల జెండాలు, కండువాలు, టోపీలు, బ్యానర్ల ఆర్డర్లు గతంలో వచ్చేవి. ఈసారి ఎన్నికల కోడ్ అమలును కట్టుదిట్టం చేయడంతో ఆర్డర్లు దూరమయ్యాయి. గతంతో పోల్చితే పది శాతం ఆర్డర్లు కూడా రాలేదు. పొరుగు రాష్ట్రాల్లోనూ డిజిటల్ ప్రింటింగ్ మెషిన్స్ రావడంతో సిరిసిల్లకు ఎన్నికల ప్రచార సామగ్రి ఆర్డర్లు దూరమయ్యాయి. ఈ రంగంపై ఆధారపడిన వారికి ఉపాధి కరువైంది.

– ద్యావనపల్లి మురళి, వస్త్రవ్యాపారి, సిరిసిల్ల

కోడలి హత్య కేసులో అత్తామామ అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ ఆరిఫ్ అలీఖాన్

సారంగాపూర్/జగిత్యాల క్రైం: సారంగాపూర్ మండలం లచ్చనాయక్‌తండా పంచాయతీ పరిధి కొత్తపల్లి తండాలో వివాహితను అతి కిరాతకంగా హత్య చేసిన కేసులో నిందితులైన ఆమె అత్తామామను అరెస్టు చేసినట్లు జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కొత్తపల్లి తండాకు చెందిన ఆకుల మౌనిక ఇతరులతో సన్నిహితంగా మాట్లాడుతూ గ్రామంలో తమ పరువు తీసిందని ఆమె అత్త గంగవ్వ, మామ రాజిరెడ్డి, న్యూజిలాండ్‌లో ఉన్న భర్త తిరుపతి భావించారు. మౌనికను ఎలాగైనా అంతమొందించాలని పథకం రూపొందించారు. ఈ క్రమంలో గత నెల 30న రాత్రి ఆమె తన ఇద్దరు కూతుళ్లతో కలిసి నిద్రించింది. మరుసటి రోజు ఉదయం 5 గంటలకు మౌనిక నిద్ర లేవకముందే ఆమె మెడపై మామ రాజిరెడ్డి పదునైన కత్తితో దాడి చేసి, హత్య చేశాడు. ఈ ఘటనలో తీవ్ర రక్తస్రావమై, ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. రాజిరెడ్డి, అతని భార్య గంగవ్వ అక్కడి నుంచి పరారయ్యారు. మృతురాలి తండ్రి రాజం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఆదివారం లక్ష్మీదేవిపల్లి–రేచపల్లి క్రాస్ రోడ్డు వద్ద హెడ్‌కానిస్టేబుల్ అహ్మద్, పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో రాజిరెడ్డి, గంగవ్వ బైక్‌పై వెళ్తుండగా అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తితోపాటు ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జడ్జి ఎదుట హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

మౌనికను వేధించినవారిని అరెస్టు చేస్తాం

రేచపల్లి, లచ్చక్కపేటకు చెందిన ఇద్దరు యువకులు తనను వేధింపులకు గురిచేస్తున్నారని మౌనిక గత నెల 27న సారంగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని సీఐ తెలిపారు. వారిపై 354డీ, 504, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని, రెండు రోజుల్లో అరెస్టు చేస్తామని పేర్కొన్నారు.

సింగరేణి కార్మికుడి బలవన్మరణం



నరేశ్ (ఫైల్)

గోదావరిఖని(రామగుండం): ఓ సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నట్లు గోదావరిఖని వన్ టౌన్ ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గోదావరిఖని తిలక్‌నగర్‌కు చెందిన బొడ్డుపల్లి నరేశ్ (38) ఆర్జీ–1 ఏరియా జీడీకే–1వ గనిలో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. ఇతను అవివాహితుడు. కాగా, కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేకపోవడంతో డ్యూటీకి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. గతంలో ఒకసారి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంట్లోని టీవీ, ఫ్రిజ్, కూలర్, వాషింగ్ మెషిన్‌లను పగులగొట్టాడు. తల్లిని కొట్టి, రోడ్డు మీదకు నెట్టివేశాడు. అనంతరం ఇంట్లోకి వెళ్లి, సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి తల్లి గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పెళ్లి జరగడం లేదని కోర్కల్‌వాసి..


వీణవంక(హుజూరాబాద్): మండలంలోని కోర్కల్ గ్రామానికి చెందిన పూదరి కుమార్(38) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం.. కుమార్ తనకు వివాహం జరగడం లేదని మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది, శనివారం క్రిమిసంహారక మందు తాగగా కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రైలు కిందపడి, గుర్తు తెలియని వృద్ధురాలు..

జమ్మికుంట(హుజూరాబాద్): రైలు కిందపడి, గుర్తు తెలియని వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుందని రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. జమ్మికుంట, బిజిగిరిషరీఫ్ రైల్వేస్టేషన్ల మధ్య యూపీ రాజధాని రైలు కింద దూకిందన్నారు. మృతురాలి వయసు 60 ఏళ్ల వరకు ఉంటుందని, ఎలాంటి గుర్తింపు కార్డు లేదని, తెలుపు డబ్బాలున్న లేత పసరు రంగు చీర, మెరూన్ రంగు జాకెట్ ధరించిందని పేర్కొన్నారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసినవారు 99493 04574, 87126 58604 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

13న ప్రజాస్వామ్య పండుగకు రండి

- అందరూ ఓటు వేయాలంటూ ఆహ్వాన పత్రిక
- సోషల్ మీడియాలో వైరల్



ఆహ్వాన పత్రిక

కరీంనగర్‌రూరల్: ఓటు వేయడానికి రావాలంటూ ప్రజాస్వామ్య పండుగ పేరిట ముద్రించిన ఓ ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ నెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగగా అందులో పేర్కొన్నారు. ఓటర్లందరూ కుటుంబసభ్యులతో కలిసి తప్పనిసరిగా ఓటు వేసేందుకు తరలిరావాలని కోరారు. పోలింగ్ వేళలను వేడుక సమయం, పోలింగ్ స్టేషన్‌ను వేదికగా, ఐదేళ్ల ప్రజాస్వామ్య ఫలాలను విందుగా సూచించారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకే ఆహ్వాన పత్రిక రూపొందించినట్లు చివరలో పేర్కొన్నారు.

మద్యం మత్తులో విష గుళికలు మింగి..

- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి
- మృతుడి స్వస్థలం నెల్లూరు జిల్లా

ధర్మారం(ధర్మపురి): మద్యం మత్తులో విష గుళికలు మింగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై సత్యనారాయణ వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా జలదం గ్రామానికి చెందిన కల్లోల వెంకయ్య(40) ఉపాధి నిమిత్తం తన కుటుంబసభ్యులతో కలిసి 15 రోజుల క్రితం ధర్మారం మండలంలోని బంజేరుపల్లికి వచ్చాడు. శనివారం రాత్రి మద్యం మత్తులో విష గుళికలు మింగాడు. గమనించిన కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయాడు. మృతుడి భార్య వెంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ముగ్గురు పిల్లలున్నారు.

చికిత్స పొందుతూ ఎంబీఏ విద్యార్థి మృతి

కరీంనగర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎంబీఏ విద్యార్థి చికిత్స పొందుతూ మృతిచెందాడు. కరీంనగర్‌రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. గంగాధర మండలంలోని చర్లపల్లికి చెందిన దయ్యాల మల్లయ్య రెండో కుమారుడు మనోహర్(23) ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం పని నిమిత్తం బైక్‌పై చొప్పదండి వెళ్లి, తిరిగి వస్తున్నాడు. తీగలగుట్టపల్లిలో రోడ్డుపై నిలిచి ఉన్న టవేరా వాహనాన్ని వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మనోహర్ ఎగిరి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుడి చేయి, పక్కటెముకలు విరిగిపోయాయి. అక్కడే నిల్చున్న మరో ముగ్గురు గాయపడ్డారు. బాధితులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మనోహర్‌ను మెరుగైన వైద్యం కోసం అతని కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి..



రాజయ్య మృతదేహం

జమ్మికుంట(హుజూరాబాద్): మతిస్థిమితం లేని ఓ వ్యక్తి మృతిచెందాడు. జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండలంలోని చిన్నకోమటిపల్లికి చెందిన మూడెడ్ల రాజయ్య(50) అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. మతిస్థిమితం సరిగా లేక ఊరూరా తిరుగుతూ భిక్షాటన చేస్తూ, ప్లాస్టిక్ బాటిళ్లు ఏరుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో వారం రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లిలోని ఆదర్శకాలనీ సమీప రైల్వే ట్రాక్ పక్కన శవమై కనిపించాడు. అతను ఎండ తీవ్రతకు చనిపోయి ఉండవచ్చని కుటుంబసభ్యులు భావిస్తున్నారు. మృతుడి తమ్ముడు అచ్చయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడని రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. అతను అనారోగ్య కారణాలు లేదా వడదెబ్బతో చనిపోయి ఉండవచ్చన్నారు. మృతుడి వయసు 55 ఏళ్ల వరకు ఉంటుందని, గ్రీన్ కలర్ టీషర్ట్, నలుపు రంగు నిక్కర్ ధరించాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, వివరాలు తెలిసినవారు 99493 04574, 87126 58604 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): రామలక్ష్మణపల్లె, ముస్తాబాద్‌లలో మానేరు వాగు నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న 3 ట్రాక్టర్లను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. వాటిని ఠాణాకు తరలించామన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పది రోజుల్లో బిడ్డ పెళ్లి.. అంతలోనే తండ్రి మృతి

- వాంతులు చేసుకున్న కోరుట్లవాసి
- వైద్యులు చికిత్స అందించలేదని కుటుంబసభ్యుల ఆరోపణ
- ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు, సిబ్బందితో గొడవ
- ఫర్నిచర్ ధ్వంసం



ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు



నజీబుర్ రెహ్మాన్ మృతదేహం



ధ్వంసమైన ఆస్పత్రి ఫర్నిచర్

కోరుట్ల: పది రోజుల్లో బిడ్డ పెళ్లి.. అంతలోనే వాంతులు చేసుకొని, మృతిచెందాడు కోరుట్లకు చెందిన ఓ ఆటోడ్రైవర్. వైద్యులు సమయానికి చికిత్స అందించక పోవడం వల్లే చనిపోయాడని మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. ఆస్పత్రి ఫర్నిచర్ ధ్వంసం చేసి, దవాఖానా ఎదుట ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని హాజీపురకు చెందిన నజీబుర్ రెహ్మాన్(48) ఆటోడ్రైవర్. ఆదివారం మధ్యాహ్నం బస్టాండ్ ఆటో అడ్డా వద్ద వాంతులు చేసుకున్నాడు. అక్కడున్నవారు అతన్ని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించకుండా గంటసేపు కాలయాపన చేసి, చివరికి నజీబుర్ రెహ్మాన్ మృతిచెందినట్లు చెప్పారు. అతని పరిస్థితి విషమంగా ఉందని చెబితే మరో ఆస్పత్రికి తీసుకువెళ్లేవారమని కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బంధువులతో కలిసి ఆస్పత్రి అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం చేసి, ఆందోళన చేపట్టారు. వైద్యుడు శ్రవణ్, సిబ్బందిపై గొడవకు దిగడంతో ఓ గదిలోకి వెళ్లి, దాక్కున్నారు.

న్యాయం జరిగేలా చూస్తామని హామీ..

పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నప్పటికీ గొడవ సద్దుమణగలేదు. బాధితులు వైద్య సిబ్బంది దాక్కున్న గదిలోకి పెట్రోల్ విసరడంతో అప్రమత్తమయ్యారు. వారిని అక్కడినుంచి సురక్షితంగా తరలించారు. సుమారు 4 గంటలపాటు ఉద్రిక్తత నెలకొంది. చివరకు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్ రావు, కోరుట్ల సీఐ సురేశ్‌బాబు, ఎస్సైలు చిరంజీవి, శ్యాంరాజ్, నవీన్ మృతుడి బంధువులతో మాట్లాడారు. న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. ఈ నెల 17న పెద్ద కూతురి వివాహం జరగాల్సి ఉంది. ఈ సమయంలో నజీబుర్ రెహ్మాన్ ఆకస్మిక మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

తండ్రిపై తనయుడి దాడి



గాయపడిన రమేశ్

వేములవాడ అర్బన్: కుటుంబ గొడవల నేపథ్యంలో ఓ యువకుడు తన తండ్రిపై దాడి చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లిలోని శాలరామన్నపల్లికి చెందిన ఉప్పుల రమేశ్ ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. దీంతో అతను కొంతకాలంగా వేములవాడలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. రమేశ్ ఆదివారం ఉదయం వేములవాడ రెండో బైపాస్ రోడ్డులో ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అతని కుమారుడు మహేశ్ వెంబడించి, రాడ్డుతో దాడి చేశాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని వేములవాడ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్ ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

కారును ఢీకొన్న ఆటో

- మహిళకు తీవ్ర గాయాలు

వేములవాడరూరల్: కారును ఆటో ఢీకొన్న ఘటనలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన శారద–వెంకటేశ్ దంపతులు తమ ఆటోలో ఆదివారం వేములవాడ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో ఓ కారు వేములవాడ నుంచి రుద్రంగి వెళ్తోంది. నాగాయపల్లి వద్ద ఆటో వేగంగా వచ్చి, కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శారదకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోడ్రైవర్ వెంకటేశ్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉద్యోగం రాలేదని మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- జక్కుల చెరువులో శవమై తేలిన లవన్‌కుమార్
- రాచర్లబొప్పాపూర్‌లో విషాదం



లవన్‌కుమార్ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఉన్నత చదువులు చదివినా ప్రభుత్వ ఉద్యోగం రాక ఓ నిరుద్యోగి మనస్తాపంతో చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో విషాదం నింపింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాచర్లబొప్పాపూర్‌కు చెందిన ఆకుల లవన్‌కుమార్(22) ఎంబీఏ పూర్తి చేశాడు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు రాసినా ఉద్యోగం రాకపోవడంతో ఖాళీగా ఉంటున్నాడు. ఈక్రమంలో గత నెల 7న తల్లి వనజతో కూలర్ విషయంలో గొడవపడి హైదరాబాద్ వెళ్లాడు. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. రాచర్లబొప్పాపూర్ శివారులోని జక్కుల చెరువులో ఆదివారం లవన్‌కుమార్ శవమై తేలాడు. చెరువు గట్టుపైన బైక్ నిలిపి ఉండడంతో స్థానికులు గుర్తించి 100కు డయల్ చేశారు. పోలీసులు, స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. తల్లి వనజ చెరువు వద్దకు చేరుకొని కొడుకు మృతదేహంపై పడి రోదించడం కలచివేసింది. మృతుని సోదరుడు మణికంఠ బతుకుదెరువు కోసం మలేషియా వెళ్లగా, తండ్రి ఆంజనేయులు కరోనా సమయంలో ప్రాణాలు కోల్పోయాడు. తల్లి వనజ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

చెట్టు కూలి వాహనాలు ధ్వంసం

- డాగ్‌స్క్వాడ్ బృందానికి తప్పిన ప్రాణాపాయం
- వేములవాడ వీబీపీ రోడ్డులో ఘటన



వాహనాలపై కూలిన చెట్టు, ప్రాణాలతో బయటపడిన శునకం, సిబ్బంది

వేములవాడ: ప్రధాని మోదీ ఈ నెల 8న వేములవాడ వస్తుండటంతో రాజన్నసిరిసిల్ల జిల్లా పోలీసు యంత్రాంగం భద్రతా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లా డాగ్ స్క్వాడ్ పోలీసుల బృందం ఆదివారం ఆలయ పరిసరాలు, ప్రధానాలయం తదితర భక్తులు తిరిగే ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, తిరుగు పయనమైంది. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం కలిగించేందుకు శునకంపై నీళ్లు చల్లాలని వేములవాడ పట్టణంలోని వీబీపీ రోడ్డులో గల పార్వతీపురం వసతి గదుల వెనక భాగంలోని ఓ చెట్టు కింద ఆగారు. కానీ, అది క్షణాల వ్యవధిలోనే పోలీసు వాహనంతోపాటు అక్కడే పార్క్ చేసిన మరో రెండు కార్లపై పడింది. ఈ ఘటనలో మూడు వాహనాలూ ధ్వంసమయ్యాయి. పోలీసులు, శునకానికి ప్రాణాపాయం తప్పడంతో అక్కడున్నవారు ఊపిరి పీల్చుకున్నారు. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పోలీసులు, ఆలయ అధికారులు దాన్ని కట్ చేయించి, రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ప్రాంతంలో మరికొన్ని చెట్లు కూలిపోయే స్థితిలో ఉన్నాయని, ప్రమాదాలు జరగక ముందే వాటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

బాహుబలుల బరి!

మామాజీ, దిగ్గీ రాజా, సింధియాల గురి | మధ్యప్రదేశ్‌లో 9 చోట్ల 7న పోలింగ్ | అన్నీ కమలనాథుల సిట్టింగ్ స్థానాలే | ఈసారి కొన్నింట కాంగ్రెస్ గట్టి పోటీ

వారిద్దరూ మాజీ సీఎంలు. ఒకరు రాష్ట్రంలో, మరొకరు కేంద్రంలోనూ చక్రం తిప్పిన ఉద్దండులు. సుదీర్ఘకాలం తర్వాత లోక్‌సభ బరిలో దిగారు. వీరికి తోడు కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా. ఇలా పలువురు కీలకమైన నేతల పోటీకి మధ్యప్రదేశ్‌లో మూడో విడత ఎన్నికలు వేదికగా మారాయి. రాష్ట్రంలోని 9 లోక్‌సభ స్థానాలకు 7న పోలింగ్ జరగనుంది. 2019 ఎన్నికల్లో వీటన్నింటిలోనూ కమలమే విరబూసింది. ఈసారి పలు స్థానాల్లో కాంగ్రెస్ గట్టి పోటీయే ఇస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని కీలక స్థానాలపై ఫోకస్...

– సాక్షి, నేషనల్ డెస్క్


సింధియా · చౌహాన్ · దిగ్విజయ్ · అలోక్‌సింగ్ · సంధ్యా రాయ్ · సికర్‌వార్

విదిశ

మధ్యప్రదేశ్‌కు సుదీర్ఘకాలం సీఎంగా ఉన్న బీజేపీ దిగ్గజం శివరాజ్‌సింగ్ చౌహాన్ లోక్‌సభ బాట పట్టారు. విదిశ ఓటర్లకు ఆయన కొత్తేమీ కాదు. 1996, 1998, 1999, 2004 ఎన్నికల్లో ఇక్కడి నుంచి వరుసగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. మొత్తమ్మీద ఇక్కడి నుంచి ఐదుసార్లు గెలిచారు. నియోజకవర్గ ప్రజలు చౌహాన్‌ను ఆప్యాయంగా మామాజీ అని పిలుచుకుంటారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్ భాను శర్మతో పోలిస్తే ఆయనకే విజయావకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. 1991లో వాజ్‌పేయినీ లోక్‌సభకు పంపిన చరిత్ర విదిశకు ఉంది. 2009, 2014 ఎన్నికల్లో బీజేపీ దిగ్గజం సుష్మా స్వరాజ్ కూడా ఇక్కడి నుంచి గెలిచారు.

రాజ్‌గఢ్

మాజీ సీఎం, కాంగ్రెస్ కీలక నేత దిగ్విజయ్ సింగ్ పోటీలో ఉండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక్కడి ప్రజలు గత రెండు ఎన్నికలుగా బీజేపీనే గెలిపిస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లోనూ బీజేపీ నుంచి రోడ్మల్ నాగర్ ఇక్కడ బంపర్ మెజారిటీతో విజయం సాధించారు. 2014లో 2.28 లక్షల మెజారిటీ సాధించగా 2019లో 4.31 లక్షలకు పెంచుకున్నారు. ఈసారీ బీజేపీ నుంచి ఆయనే బరిలో ఉన్నారు. అభిమానులు దిగ్గీ రాజా అని పిలుచుకునే దిగ్విజయ్ ఏకంగా 30 ఏళ్ల తర్వాత ఇక్కడ పోటీకి దిగుతుండటం విశేషం. ఆయన సోదరుడు లక్ష్మణ్ సింగ్ ఇక్కడ ఐదుసార్లు గెలిచారు లక్ష్మణ్ సింగ్ 2004లో బీజేపీ టికెట్‌పైనా గెలవడం విశేషం!

వీటికి ఎన్నిక

మొరేనా, భిండ్, గ్వాలియర్, గుణ, సాగర్, విదిశ, భోపాల్, రాజ్‌గఢ్, బేతూల్ (ఇక్కడ రెండో విడతలోనే పోలింగ్ జరగాల్సింది. బీఎస్పీ అభ్యర్థి మృతితో మూడో విడతకు వాయిదా వేశారు)

భోపాల్

వివాదాస్పద బీజేపీ నాయకురాలు సాధ్వీ ప్రజ్ఞాసింగ్ ఠాకూర్‌కు ఇక్కడి సిట్టింగ్ ఎంపీ. 2019లో మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్‌ను ఆమె ఏకంగా 3.64 లక్షల ఓట్ల ఆధిక్యంతో మట్టి కరిపించి సంచలనం సృష్టించారు. అయినా వివాదాస్పదురాలిగా పేరుపడ్డ సాధ్వికి బీజేపీ ఈసారి టికెటివ్వకపోవడం విశేషం! భోపాల్ 1989 నుంచీ బీజేపీ కంచుకోటగా కొనసాగుతోంది. 1999లో మధ్యప్రదేశ్ మాజీ సీఎం ఉమా భారతి ఇక్కడ గెలిచారు. 2004, 2009ల్లో కైలాష్ చంద్రజోషి విజయం సొంతం చేసుకున్నారు. ఇలా అభ్యర్థులు మారుతున్నా బీజేపీనే ఓటర్లు దీవిస్తున్నారు. ఈసారి ఆ పార్టీ నుంచి అలోక్ శర్మ, కాంగ్రెస్ నుంచి అరుణ్ శ్రీవాస్తవ్ బరిలో ఉన్నారు.

మొరేనా

ఇక్కడ 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ నేత రామ్‌నివాస్ రావత్‌ను బీజేపీ అభ్యర్థి నరేంద్రసింగ్ తోమర్ 1.13 లక్షల ఓట్ల వ్యత్యాసంతో ఓడించారు. తోమర్ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో నెగ్గడంతో ఈ స్థానం ఖాళీగా ఉంది. బీజేపీ నుంచి శివమంగళ్ సింగ్ తోమర్, కాంగ్రెస్ నుంచి సత్యపాల్ సింగ్ సికర్‌వార్ పోటీ చేస్తున్నారు. 1996 నుంచి ఇక్కడ బీజేపీదే విజయం. 1996, 1998, 1999, 2004ల్లో అశోక్ అర్గల్, 2009లో నరేంద్రసింగ్ తోమర్ గెలిచారు. ఇది సురక్షిత స్థావరమనే ధీమాతో ఇప్పటిదాకా పెద్ద ఎన్నికలను ఎదుర్కోని శివమంగళ్‌ను బీజేపీ పోటీకి పెట్టింది. ఇక్కడ అభ్యర్థిని మార్చడం ఆ పార్టీకి ఇది వరుసగా మూడోసారి! కాంగ్రెస్ అభ్యర్థి సికర్‌వార్ మాజీ బీజేపీ నేతే. మొరేనాలో బ్రాహ్మణ, రాజ్‌పుత్ ఓట్లు రెండేసి లక్షల చొప్పున ఉన్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ సీట్లకు కాంగ్రెస్ ఏకంగా ఐదింట్లో గెలవడంతో ఈసారి ఫలితంపై ఆసక్తి పెరిగింది.

గుణ

ఇది సింధియాల కోట. మూడో విడతలో దేశవ్యాప్తంగా బాగా ఆసక్తి నెలకొన్న స్థానాల్లో ఒకటి. కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా 2002 నుంచి 2019 దాకా ఈ స్థానానికి కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. మారిన రాజకీయ పరిణామాల్లో ఇప్పుడు బీజేపీ తరఫున బరిలో ఉన్నారు. ఆయనతో కాంగ్రెస్ నేత రావు యాదవేంద్రసింగ్ యాదవ్ పోటీ పడుతున్నారు. 2019లో ఇక్కడ బీజేపీ నేత కృష్ణపాల్ సింగ్ యాదవ్ చేతిలో జ్యోతిరాదిత్య ఓటమి చవిచూశారు! 1957లో ఇక్కడ జ్యోతిరాదిత్య నానమ్మ విజయరాజే సింధియా గెలిచారు. 1971లో ఆమె కుమారుడు, జ్యోతిరాదిత్య తండ్రి దివంగత మాధవ్‌రావు సింధియా భారతీయ జన్‌సంఘ్ తరఫున ఇక్కడ నెగ్గారు.

భిండ్

చంబల్ ప్రాంతంలో ఉన్న ఈ స్థానంలో ఆది నుంచి బీజేపీదే ఆధిపత్యం. 2008లో ఎస్సీలకు రిజర్వ్ అయిన తర్వాత కూడా వరుసగా మూడు ఎన్నికల్లోనూ ఆ పార్టీయే గెలిచింది. కాంగ్రెస్ నుంచి ఫూల్‌సింగ్ బారియా, బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ సంధ్యా రాయ్ పోటీలో ఉన్నారు. ఇక్కడ 1971లో విజయరాజె సింధియా కాంగ్రెస్ నుంచి నెగ్గారు. భిండ్‌లో కూడా బ్రాహ్మణ, క్షత్రియ ఓట్లు కలిపి ఆరు లక్షలకు పైనే ఉన్నాయి.

విస్తృత ప్రచారం

మధ్యప్రదేశ్‌లో మూడో విడత స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. రెండు పార్టీల అగ్ర నేతలు కూడా ఇప్పటికే సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, సోదరి ప్రియాంక పలు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. తన తండ్రి రాజీవ్ గాంధీ దేశం కోసం బలిదానం చేశారంటూ మొరెనాలో ప్రియాంక భావోద్వేగపూరితంగా మాట్లాడారు. బీజేపీ నుంచి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు నడ్డా మొరేనా, బేతూల్, రాజ్‌గఢ్‌ల్లో జోరుగా ప్రచారం నిర్వహించారు. కులం, నిరుద్యోగం, పేదరికం, వలసలు మూడో విడత స్థానాల్లో బాగా ప్రభావం చూపే అంశాలు.

ఎన్నికల రంగోలి!

ఎన్నికల్లో ఓటింగ్ పెంచేందుకు ఎన్నికల సంఘం ఎన్నో వినూత్నమైన చర్యలు చేపడుతోంది. అహ్మదాబాద్ ఎన్నికల అధికారులు కొంచెం భిన్నంగా ఆలోచించారు. 'మీ విలువైన ఓటుతో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి' అన్న పిలుపు కంటే ఓటు ప్రాధాన్యతను కళాత్మకంగా చెబితే మనసులో బాగా నాటుకుంటుందని భావించారు. స్థానిక అల్ఫా వన్ మాల్ ఆవరణలో ఏకంగా 12 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవుతో ఓటుపై అవగాహన కల్పించే రంగోళీ రూపొందించారు. ఇందుకు 350 కిలోల రంగులు వినియోగించారు. 18 గంటల సమయం పట్టిందట. ప్రజలను ఓటు దిశగా ప్రోత్సహించి, అహ్మదాబాద్‌ను అత్యధిక ఓటింగ్ నమోదైన ప్రాంతంగా చేయడమే తమ ఉద్దేశమని నోడల్ ఆఫీసర్ యోగేశ్ పరేఖ్ అంటున్నారు. మాల్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఈ ఆర్ట్ తెగ ఆకర్షిస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్





శాంభవీ చౌదరి.. యంగెస్ట్ క్యాండిడేట్!

బిహార్‌లోని సమస్తిపూర్ నుంచి ఎల్‌జేపీ అభ్యర్థిగా లోక్‌సభ బరిలో

శాంభవీ చౌదరి. ఈ లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్నవారిలో అత్యంత చిన్నవయస్కురాలు. 25 ఏళ్ల శాంభవి బిహార్ మంత్రి అశోక్ చౌదరి కుమార్తె. లేడీ శ్రీరామ్ కాలేజీలో డిగ్రీ, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ చేశారు. బిహార్‌లోని మగధ్ వర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అభ్యర్థిగా సమస్తిపూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు.

రాజకీయ కుటుంబంలో పుట్టిపెరగడంతో శాంభవికి సహజంగానే రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. తొలుత చదువుకే ప్రాధాన్యమిచ్చారు. బిహార్‌లో దేవాలయాల్లో దళిత పూజారులను నియమించిన మాజీ ఐపీఎస్ అధికారి ఆచార్య కిషోర్ కునాల్ కుమారుడు సాయన్ కునాల్‌ను పెళ్లాడారు. అత్తగారి ఊరైన సమస్తిపూర్ నుంచి లోక్‌సభ బరిలో ఉన్నారు. పైగా తండ్రి పార్టీ అయిన జేడీ(యూ)ను కాదని చిరాగ్ పార్టీలో చేరడం విశేషం! అది తన సొంత రాజకీయ నిర్ణయం అంటారామె. బిహార్‌కు, బిహారీలకు తొలి ప్రాధాన్యమిచ్చే చిరాగ్ విజన్ నచ్చి ఎల్‌జేపీలో చేరానంటారు. ''చిరాగ్ భయ్యా విజన్‌కు ఆకర్షితురాలినయ్యాను. ఎందుకంటే నేను ఢిల్లీ వర్సిటీలో చదివేటప్పుడు 'మీరు బిహారీలా కనిపించడం లే'దని ప్రొఫెసర్లు అనేవారు. బిహారీలా కనిపించకపోవడం, దళితురాలిగా కనిపించకపోవడం ఏమిటా అని ఎప్పుడూ ఆలోచించేదాన్ని. అది నాపై తీవ్ర ప్రభావం చూపింది'' అంటారు శాంభవి. ''సమస్తిపూర్‌లో విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన నా తొలి ప్రాథమ్యాలు. వచ్చే ఐదేళ్లలో రాబోయే తరాల కోసం సరికొత్త సమస్తిపూర్‌ను అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నా'' అని వివరించారు. కాంగ్రెస్‌తో స్థానికంగా యాదవ, ముస్లిం, ఓబీసీ ఓటు బ్యాంకు అధికంగా ఉన్నా తన ఎస్సీ నేపథ్యం, భర్త ఓబీసీ నేపథ్యం కలిసొస్తాయని ధీమాతో ఉన్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

తొలి రెండు దశల్లోనూ...

తగ్గిన మహిళా ఓటింగ్

పురుషులతో పోలిస్తే పలు రాష్ట్రాల్లో భారీ అంతరం

మహిళలు ఆకాశంలో సగం. అవకాశాల్లో అంతకంటే ఎక్కువే. అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానం. ఓటర్లపరంగా చూస్తే పలు రాష్ట్రాల్లో పురుషుల కంటే ఎక్కువే. అందుకే పార్టీలన్నీ తమ మేనిఫెస్టోల్లో మహిళలకు పెద్దపీట వేస్తున్నాయి. చాలా రాష్ట్రాల్లో మహిళల కోసం ప్రత్యేక పథకాలు పుట్టుకొస్తున్నాయి. కర్నాటకలో, తాజాగా తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల జయాపజయాల్ని నిర్దేశించింది ఈ మహిళా పథకాలే! అయితే ఎందుకో గానీ ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మహిళల్లో 'ఓటు ఉత్సాహం' లోపిస్తోంది. ఇప్పటిదాకా జరిగిన రెండు విడతల పోలింగ్‌లో మహిళల ఓటింగ్ శాతం తగ్గినట్టు కేంద్ర ఎన్నికల సంఘం తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇది మంచి పరిణామం కాదంటున్నారు విశ్లేషకులు...

– సాక్షి, నేషనల్ డెస్క్



లోక్‌సభ ఎన్నికల తొలి రెండు విడతల పోలింగ్‌ను పరిశీలిస్తే దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో మహిళల ఓటింగ్ శాతంలో తగ్గుదల నమోదైంది. 2019తో పోల్చి చూసినప్పుడు 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి దాకా రెండు విడతల్లో ఓటు వేసిన మహిళల శాతం 0.8 శాతం మేర తగ్గింది. 2019లో తొలి రెండు విడతలతో పోలిస్తే ఈసారి మొత్తమ్మీద (స్త్రీ, పురుషులు) 3.3 శాతం దాకా తక్కువ ఓటింగ్ నమోదైంది. ఈ ఏడాది తొలి విడతలో దశలో 66.14 శాతం, రెండో విడతలో 66.71 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019లో మొదటి దశలో 69.4 శాతం, రెండో దశలో 69.6 శాతం ఓటింగ్ నమోదైంది.

ఇక్కడ దయనీయం

గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే నాగాలాండ్ లోక్‌సభ స్థానంలో ఈసారి రికార్డు స్థాయిలో మహిళల ఓటింగ్ ఏకంగా 24.79 శాతం తగ్గిపోయింది! మొత్తమ్మీద కూడా అక్కడ చాలా తక్కువ ఓటింగ్ నమోదైంది. మహిళల ఓటింగ్ సిద్ధీ లోక్‌సభ స్థానంలో 13 శాతం, మథురలో 13 శాతం, రేవా, పథనంతిట్టల్లో 12 శాతం, ముజఫర్‌నగర్, ఖజురహోల్లో 11 శాతం తగ్గింది. కొట్టాయం, ఇడుక్కి, రాంపూర్, సత్నా, భాగ్‌పత్‌ల్లో 10 శాతం, వయనాడ్‌లో 7 శాతం, బెంగళూరు రూరల్‌లో 7 శాతం, ఔరంగాబాద్‌లో 5 శాతం, ఝుంఝునూలో 9 శాతం, షిల్లాంగ్‌లో 8 శాతం చొప్పున మహిళల ఓటింగ్ తగ్గింది. మొత్తం మీద చూస్తే 14 లోక్‌సభ స్థానాల్లో 10 నంచి 20 శాతం మధ్య, 59 చోట్ల 5–10 శాతం, 80 చోట్ల 0–5 శాతం ఓటింగ్ తగ్గిపోయింది. ఛత్తీస్‌గఢ్, కర్నాటక, త్రిపుర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, అండమాన్ నికోబార్, రాజస్థాన్, మిజోరం, యూపీల్లో మహిళల ఓటింగ్ బాగా తగ్గడం ఆందోళన కలిగిస్తోంది.

ఇక్కడ నయం

రెండు దశల్లో ఎన్నికలకు వెళ్లిన నియోజకవర్గాల్లో 34 చోట్ల మాత్రం మహిళల ఓటింగ్ 0–5 శాతం మధ్య పెరిగింది. ఒక స్థానంలో ఇది మరింత ఎక్కువగా నమోదైంది. లక్షద్వీప్, అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర స్థానాల్లో 80 శాతం మహిళలు ఉత్సాహంగా ఓటు వేయడం ప్రోత్సాహనీయం. బీహార్, ఉత్తరాఖండ్, జమ్మూ కశ్మీర్, తమిళనాడు, కేరళ, మేఘాలయ, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లోనూ, పుదుచ్చేరిలోనూ పురుషులతో పోలిస్తే మహిళలే ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల తొలి రెండు దశల్లో రాష్ట్రాలవారీగా పోలింగ్ శాతం

రాష్ట్రం/యూటీ	మహిళల ఓటింగ్	పురుషుల ఓటింగ్
లక్షద్వీప్	85.5	82.9
త్రిపుర	80.6	81.3
సిక్కిం	79.8	79.9
అసోం	79.6	79
పుదుచ్చేరి	79.1	78.6
పశ్చిమబెంగాల్	80.3	78.3
మణిపూర్	79	77.9
అరుణాచల్‌ప్రదేశ్	80.6	76.3
మేఘాలయ	79.7	75.4
ఛత్తీస్‌గఢ్	73.5	75
కర్నాటక	71.1	71.5
కేరళ	71.7	70.6
తమిళనాడు	70.2	69.8
జమ్మూకశ్మీర్	71	69.6
మహారాష్ట్ర	60.7	65.9
మధ్యప్రదేశ్	61.3	65.3
అండమాన్	63.8	64.4
రాజస్థాన్	60.5	62.2
ఉత్తరప్రదేశ్	56.7	56.9
మిజోరం	55.7	58.1
నాగాలాండ్	57.9	57.5
ఉత్తరాఖండ్	58	54.5
బిహార్	56	53.2

ప్రస్తుత ఎన్నికల వరకే చూస్తే మొత్తం మీద స్త్రీ పురుషుల ఓటింగ్ మధ్య పెద్ద వ్యత్యాసం కనిపించడం లేదు. తొలి విడతలో మహిళల ఓటింగ్ 66.1 శాతం, పురుషుల ఓటింగ్ 66.2 శాతం నమోదైంది. రెండో విడతలో 66.4, 67 శాతంగా ఉంది. రాష్ట్రాలవారీగా చూస్తే మాత్రం తేడా బాగానే ఉంది.

మంచి పరిణామం కాదు

మహిళలు మరింతగా ముందుకొచ్చి ఓటు వేస్తేనే నేతలకు, పార్టీలకు, ప్రభుత్వాలకు స్పష్టమైన సందేశం సాధ్యమని విశ్లేషకులు అంటున్నారు. మిగతా ఐదు విడతల పోలింగ్‌లోనూ మహిళల అనాసక్తి ఇలాగే కొనసాగితే అది ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయవచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది. మహిళా ఓటర్ల మనసు గెలిచేందుకు పార్టీలు మరింత కృషి చేయాల్సిన అవసరాన్ని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయన్న అభిప్రాయమూ ఉంది.

సంయుక్త... మంత్రిగారి అమ్మాయి

పుస్తకాల పురుగు



పరిచయం

సంయుక్తా పాటిల్. మంచి ఫుడీ. అంతకు మించి పుస్తకాల పురుగు. మంచి పుస్తకం దొరికిందంటే దాన్ని పూర్తి చేసేవరకు నిద్రపోరు. బసవేశ్వరుని భక్తురాలు. కర్నాటక వ్యవసాయ మంత్రి శివానంద్ పాటిల్ కూతురైన సంయుక్త బీజాపూర్ గ్రామీణ మహిళల సాధికారత కోసం కృషి చేస్తున్నారు. జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్‌గా వారి ఆర్థిక స్వావలంబన కోసం పాటుపడుతున్నారు. బాగల్‌కోట్ నుంచి తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల బరిలో దిగారు. నాలుగు సార్లు ఎంపీగా గెలిచిన బీజేపీ సీనియర్ నేత పీసీ గద్దిగౌడర్‌తో కాంగ్రెస్ తరఫున తలపడుతున్నారు...

– సాక్షి, నేషనల్ డెస్క్

క్షేత్రస్థాయిలో..

30 ఏళ్ల సంయుక్త క్రైస్ట్ యూనివర్సిటీ లా స్కూల్లో న్యాయ శాస్త్రం చదివారు. తండ్రి రాజకీయాలను చూస్తూ ఎదిగారు. విద్యార్థిగా ఎన్ఎస్‌యూఐలో పని చేశారు. యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా అత్యధిక ఓట్లతో గెలిచారు. మహిళా కాంగ్రెస్ నాయకురాలిగా ప్రజల మనసులను గెలుచుకున్నారు. అధికారం ఉన్నా, లేకున్నా ప్రజలతో మమేకమై ఉండాలన్న పాఠాన్ని తండ్రి నుంచి నేర్చుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రజల సంక్షేమానికి పని చేయాలన్న తండ్రి సూచన మేరకు 2017లో స్పర్శ్ ఫౌండేషన్ ప్రారంభించారు. ఇది గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత కోసం పనిచేస్తుంది. పాలసీలు సమాజంలోని అట్టడుగు వ్యక్తులకు చేరినప్పుడే అవి విజయం సాధించినట్లని సంయుక్త నమ్ముతారు. సాయంకాలాల్లో గ్రామాల్లోని ప్రజలను కలవడానికే ఇష్టపడతారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బసవనబాగేవాడి నియోజకవర్గంలో తండ్రి ప్రచారమంతా తానై నిర్వహించారు. అయితే ఎన్నికల ప్లానింగ్ ఒకెత్తు. నేరుగా పోటీ చేయడం మరో ఎత్తు. విద్యార్థి, యువజన సంఘాల ఎన్నికల అనుభవం తనకిప్పుడు ఉపయోగపడుతుందంటారామె. కొత్త పరిశ్రమలు, పర్యాటకాభివృద్ధి, బాగల్‌కోట్–కుడచి పెండింగ్ రైల్వే లైన్ పరిపూర్తి, నియోజకవర్గ సమగ్రాభివృద్ధి ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నారు. వ్యవసాయాధారిత బాగల్‌కోట్ ప్రాంతం రెండు కరువులను ఎదుర్కొంది. ''అందుకే నీటి పారుదలపై దృష్టి పెడతా. ప్రజల గొంతుకగా మారతా'' అంటున్నారు.

బీజేపీకి గట్టి సమాధానం..

వారసత్వ రాజకీయాలపై బీజేపీ విమర్శలను సంయుక్త తేలిగ్గా తీసిపారేస్తారు. ''తల్లిదండ్రుల నేపథ్యం వల్ల రాజకీయాల్లోకి ఎంట్రీ సులభం అవుతుంది. కానీ చివరికి ప్రజలే నిర్ణేతలు. వాళ్లు అంగీకరించకపోతే ఎంతటి నేతల పిల్లలయినా రాజకీయాల్లో రాణించలేరు'' అన్నది ఆమె వాదన. ''దేశంలోని 65 శాతం మంది ఓటర్లు 40 ఏళ్ల లోపువారే. 50 శాతం 25 ఏళ్ల లోపువారే. కానీ 40 ఏళ్ల లోపున్న పార్లమెంటేరియన్లు మాత్రం కేవలం 12 శాతం. యువత ప్రజాప్రతినిధుల సంఖ్య బాగా పెరగాలి'' అంటారు సంయుక్త. ఆమె విజయపుర అసెంబ్లీ నియోజకవర్గవాసి. కనుక బాగల్‌కోట్‌కు బయటి వ్యక్తి అంటూ బీజేపీ విమర్శిస్తోంది. తాను బయటి వ్యక్తినెలా అవుతానని ప్రశ్నిస్తారామె. ''నేను అవిభక్త బీజాపూర్‌లో పుట్టా. ప్రతి ర్యాలీలోనూ నాకు ఘన స్వాగతం లభిస్తోంది. ఏ ఇంటికి వెళ్లినా నా ఇంటికి వెళ్లినట్టే ఉంటుంది'' అంటూ కొట్టిపారేస్తారు. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యంపైనా గళం విప్పుతున్నారు సంయుక్త. రాజకీయాల్లో ఎక్కువ మంది మహిళలుంటే విధాన రూపకల్పనలో మహిళా దృక్పథం వస్తుందన్నది ఆమె వాదన.

ఎనిమిదేళ్లుగా రంజాన్ ఉపవాసాలు...

సంయుక్త 12వ శతాబ్దపు మత, సంఘ సంస్కర్త బసవేశ్వరుని భక్తురాలు. అయితే ఎనిమిదేళ్లుగా రంజాన్ మాసమంతా విధిగా ఉపవాసం (రోజా) పాటిస్తున్నారు. మతమేదైనా విశ్వాసం మంచిదైనప్పుడు ఆచరించడంలో తప్పేముందని ప్రశ్నిస్తారు. ''పెద్దయ్యాక ఏమవుతావని నా చిన్నతనంలో ఎవరడిగినా ప్రధాని అవుతాననేదాన్ని. ఇప్పుడు ఎంపీ అయ్యే అవకాశం వచ్చింది. ఏమో, భవిష్యత్‌లో ప్రధాని కూడా అవుతానేమో!'' అని ఆశాభావం వ్యక్తం చేస్తారు సంయుక్త.